క్లుప్తంగా

శాకంబరిగా సత్తెమ్మతల్లి



శాకంబరి అలంకరణలో సత్తెమ్మతల్లి

గాజువాక : ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లిని శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. గాజువాకతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సూరిశెట్టి శివ, శరగడం కోటి, శరగడం సత్యనారాయణ, మళ్ల సత్తిబాబు, జోగ అప్పారావు, గణేష్, పెద్ద అప్పారావు, శివ, శ్రీను, సురేష్, శేఖర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎంపీ జీవీఎల్ తదితరులు

గాజువాక : శ్రీనగర్‌లోని శ్రీగాయత్రి పరివార్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాయత్రి చేతన్ కేంద్రం నూతన భవనంలో ఏర్పాటు చేసిన హోమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల్లో కోట్లాది మంది భక్తులున్న సంస్థ శ్రీగాయత్రి పరివార్ అన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతూ హిందూ ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతున్న గొప్ప ధార్మిక సంస్థ అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజ్‌కుమార్‌శర్మ, ఇందిరాదేవి, జీలకర్ర రమణ, భువనేశ్వరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న శిష్టకరణ సంఘ సభ్యులు

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని గాజువాక శిష్ట కరణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కుకు చెందిన మునగవలస శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందాడు. దీంతో అతని భార్య సరిత, కుమారుడు వర్షిక్‌లను ఆదివారం పరామర్శించారు. సంఘం తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్కుమహంతి రాజా, బద్రి మహంతి వెంకటరావు, గౌరీప్రసాదరావు, ప్రతాపరావు, వెంకటేశ్వరరావు, ఫణీంద్ర పాల్గొన్నారు.

రెండవ రోజూ పింఛన్ల పంపిణీ



చినఅక్కిరెడ్డిపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్, కన్వీనర్

అక్కిరెడ్డిపాలెం: రెండో రోజూ జోరుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆదివారం 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెంలో వలంటీర్ గొర్లె సత్యవతితో కలిసి కన్వీనర్ సంగ్రాన నూకరాజు లబ్ధిదారులు అప్పలనాయుడు, ఎస్. చంద్రమౌళి, వి. వీరారావులకు పింఛన్లు అందజేశారు. అనంతరం వారు జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పేదల పక్షాన నిలిచి ఆదుకుంటున్న మనసున్న నేత సీం జగన్‌మోహన్‌రెడ్డి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి : రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, వికలాంగుల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర, ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలన్నీ నాలుగేళ్లలో పరిష్కరించి, మనసున్న ముఖ్యమంత్రిగా కీర్తి గడించారన్నారు. స్థానికంగా ఏళ్ల నుంచి పరిష్కారం కాని సమస్యలు పరిష్కరించగలిగామన్నారు. మిగిలిన సమస్యలను కొలిక్కి తేవడానికి జగనన్న సురక్ష కార్యక్రమం మొదలుపెట్టామన్నారు. అంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కింతాద ఈశ్వరరావు, పచ్చికోరు రమణమూర్తి, సేనాపతి గంగరాజు, గొన్న హేమచంద్ర, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు సీతారామయ్య, ప్రసాద్, కిషోర్, కాతా నూకేష్, అప్పలరాజు, కనకరాజు పాల్గొన్నారు.

సమస్యలపై బీఎంఎస్ జాతీయ నాయకునికి వినతి



బీఎంఎస్ నాయకుడు పాండేకు వినతిపత్రం అందజేస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: ఆదివారం ఉక్కునగరం బీఎంఎస్ కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు కోరాడ వెంకటరావు నేతృత్వంలో ఉక్కు అధికారుల సంఘం జాతీయ బీఎంఎస్ నాయకుడు, ఎన్‌జేసీఎస్ సభ్యుడు డి. పాండేను కలిసి వినతి పత్రం సమర్పించారు. నూతన వేతనాలు అమలులో జరుగుతున్న జాప్యం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, సత్వరం నూతన వేతనాలు అమలు చేసేలా సహకరించాలని కోరారు. అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ నేతృత్వంలో అందజేసిన వినతిపత్రంలో అధికారుల పదోన్నతుల సమస్య పరిష్కరించాలన్నారు. అధికారులకు వేతన సవరణ జరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. దీనిపై పాండే సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని శ్రీనివాస్, రాందాస్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం



గురుపూజోత్సవంలో బీజేపీ నాయకుడు నర్సింగరావు, శశిధరన్ పిళ్లై తదితరులు

పెదగంట్యాడ: జ్ఞానాన్ని అందించే గురువులను గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్‌లో గల బాలగౌరీ ఫంక్షన్ హాలులో రాష్ట్రీయ స్వయం సేవక్ పెదగంట్యాడ శాఖ సభ్యుడు కిల్లాన ముసలయ్య ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుర్బ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వరా అంటూ వారికి గురుదక్షిణ సమర్పించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. గురువును మించిన దైవం లేదన్నారు. ఈ కార్యక్రమంలో శశిధరన్ పిళ్లై, భువనేశ్వరి, పెంటకోట వెంకట నాగేశ్వరరావు, రమణ, ఎరుకునాయుడు, రంజిత్ పాల్గొన్నారు.

ఆల్ట్రాసౌండ్ పరిజ్ఞానంపై వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలనతో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఆల్ట్రాసౌండ్ పరిజ్ఞానంపై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పెతకంశెట్టి సతీష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాయింట్ ఆఫ్ కేర్ ఆల్ట్రా సౌండ్ (ఫోకస్) అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. ఇది క్రిటికల్ కేర్‌లో అంతర్గత భాగం అయిందన్నారు. రోగుల సమస్యను త్వరగా తెలుసుకోవడానికి ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రధానంగా గుండె, ఉపిరితిత్తులు, ఉదరభాగం, నరాల విషయంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఎలా చేయాలనే విషయాలను వివరించినట్లు తెలిపారు. వివిధ ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి 50 మందికి పైగా హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో క్రిటికల్ కేర్ విభాగానికి చెందిన లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.రవికృష్ణతో పాటు వైద్యులు మల్ల హరిప్రసాద్, ఆర్‌వీ గణేష్, యశ్విని, టి.మోహన్, ఎస్.మహరాజ్, టి.లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ధర్నా రేపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు టౌన్ అడ్మిన్ విభాగం ఎదురుగా నిర్వహించనున్న ధర్నాలో ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో సహా పాల్గొనాలని ఆయన కోరారు.

బట్టు సన్యాసిరావుకు నివాళి



బట్టు సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ 77వ వార్డు మాజీ అధ్యక్షుడు బట్టు సన్యాసిరావు జయంతిని ఆ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆధ్వర్యంలో నమ్మిదొడ్డి జంక్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డి, సావాడ అప్పలరెడ్డి, సూర్యనారాయణ, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



సన్నాహక సభలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ఎస్సీ వర్గీకరణ సాధనకు జూలైలో జరగబోయే ఛలో హైదరాబద్ బహిరంగ సభ సన్నాహక కార్యక్రమాన్ని 68వ వార్డు హరిజనజగ్గయ్యపాలెంలో నిర్వహించారు. ఆదివారం ఎంఆర్‌పీఎస్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఉప్పాటి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఆర్‌పీఎస్ ఎంఈఎఫ్ కన్వీనర్ దేవులపల్లి సంపూర్ణం మాట్లాడుతూ 30 లక్షల మందితో ఛలో హైదరాబాద్ బహిరంగ సభకు ఎంఎస్‌పీఎస్ కార్యకర్తలను ఆహ్వానిస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు అత్తోట రవికుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గెద్దాడ ప్రసాద్, విశాఖ దక్షిణ కన్వీనర్ తొత్తరముడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవాతి రాజేష్‌బాబు, విశాఖ ఉత్తర నియోజకవర్గం అధ్యక్షుడు గంట్యాడ అప్పలరాజు, హరిజనజగ్గయ్యపాలెం గ్రామ అధ్యక్షుడు పెట్ల అప్పారావు, రాయి అప్పారావు, లక్కవరపు ఈశ్వరరావు, గుమ్మిడి రామాంజనేయులు, మిరుగుబూడి సూరిబాబు, లక్కవరపు రాము, వంగలపూడి గోపి, తేగేటి నర్సింగ్, నేళ్ల ప్రభు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 68వ వార్డు హరిజన జగ్గయ్యపాలెం గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా పెట్ల కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.అనంతకుమార్, ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా పెట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కండిల్లి నగేష్‌లను ఎన్నుకోగా, గ్రామ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ పెద్దలు ఆమోదించారు.

వెంకన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణస్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువ జామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దాడులను నిరసిస్తూ క్రైస్తవుల ర్యాలీ



జ్ఞానాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రక్షణగిరి రహదారిలో సెయింట్ పీటర్స్ స్త్రీల కమిషన్ ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు, క్రైస్తవులపై దాడులకు ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సెయింట్ పీటర్స్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, సిస్టర్ సంగీత నేతృత్వంలో జ్ఞానాపురం గ్రామ మహిళలు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం రక్షణగిరి ముఖద్వారం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. క్రైస్తవులపై దాడులు అమానుషమన్నారు. వారికి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీల కమిషన్ అధ్యక్షురాలు జీఎల్ రాణి, ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి పి.వేళాంగిణి, కోశాధికారి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు



జీతాలు పెంచాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికుల జీతాలు తక్షణం పెంచాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో దిబ్బపాలెం పెద్దమ్మోరు ఆలయం వద్ద నుంచి పోర్టు వంతెన జంక్షన్ వద్ద గల గాంధీ విగ్రహం వరకూ ఆదివారం కుటుంబాలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలన్నారు. వారికి నెలకు రూ. 36 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి అక్రమంగా తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న కార్మికుల పిల్లలు అదానీ తాతయ్య మా నాన్న జీతాలు పెంచవా అంటూ ప్లకార్డులు ప్రదర్శించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కోరారు. వార్డు పరిధిలోని భానోజీతోటలో గల కనకదుర్గమ్మ ఆలయం వద్ద వి డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దంత సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. చిన్నపిల్లల్లో ఎక్కువగా దంత సమస్యలు తలెత్తుతుంటాయని, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం పనికి రాదన్నారు. పిల్లల దంత సంరక్షణలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.హరికిశోర్, వైద్యులు హర్షిత, పూజిత, సీఈవో వరలక్ష్మి, నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథరావు, రమణ, వెంకటరావు, కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ స్కిట్లు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ఆద్యంతం నవ్వులు పూయించింది. కామెడీ ఆర్టిస్టులు జబర్దస్త్ ప్రకాష్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, అన్వేష, దామోదర్, ఇమంది ఈశ్వరరావు, జి.వి.త్రినాథ్, బుగత సత్యనారాయణ, శ్రీధర్, పుష్యమి, మల్లిక, పోర్టు శేషులు ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. ఫోన్ చేసి మరీ అడగాల, కుక్క కరిచింది, కుక్కను అమ్మేస్తా, రక్తం, ఆర్టీసీ బస్సు, ఎఫ్4, స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కళాకారులను నందూరి రామకృష్ణ, ఎ.వి.రామకృష్ణ, దాసరి సాంబశివరావు తదితరులు సత్కరించారు.

కుసుమ హరనాథ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కూర్మన్నపాలెం : దువ్వాడలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఎముకలు, కీళ్ల సమస్యలకు సంబంధించి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లీ హెల్త్ డొమైన్, జెసీఐ స్టీల్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించి వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులు పాల్గొని బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జెసీఐ సభ్యులు సరోజిని, జయలక్ష్మి, లావణ్య, లీ ఫార్మా సంస్థల డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, కుసుమ హరనాథ ఆశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు ప్రేరణ.. ‘ది మ్యాంగో లేడీ’



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి, ఆచార్య కె.ఎస్.చలం తదితరులు

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల ‘ది మ్యాంగో లేడీ’ అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణ ఈ నవలలో రచయిత్రి చక్కగా పొందుపర్చారని, ఉద్యమాలకు ప్రేరణగా తోడ్పడుతుందని వక్తలు పేర్కొన్నారు.





పైనాపిల్‌కు గిరాకీ



సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న పైనాపిల్స్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో పైనాపిల్‌కు గిరాకీ పెరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన వజ్రం రైతు ఉత్పత్తిదారు సంఘం ప్రకృతి సిద్ధంగా పండించిన పైనాపిల్‌ను ఆదివారం ఇక్కడ విక్రయించారు. అధిక సంఖ్యలో వినియోగదారులు వాటిని కొనుగోలు చేశారు. కిలో రూ.35 చొప్పున పైనాపిల్స్‌ను విక్రయించినట్లు రైతులు ఎస్.జగ్గారావు, రవికుమార్ తెలిపారు.

నేవీ ఉద్యోగి అదృశ్యం



అదృశ్యమైన ధీరజ్‌కుమార్

మల్కాపురం: ఓ యుద్ధనౌకలో సెయిలర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. తూర్పు నౌకాదళం విభాగంలో ఎన్ఎస్ఎస్ వీరబాహు నౌకలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (28) ఈ ఏడాది జనవరిలో సెయిలర్‌గా (ఆర్‌ఎంఎస్ ర్యాంక్) చేరాడు. వీరికి ఆ నౌకలోనే భోజనం, వసతి సదుపాయం వంటివి అధికారులు కల్పిస్తారు. విధులు అనంతరం ప్రతి రోజు సాయంత్రం వీరు అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుండేవారు. ధీరజ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకొని అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తోటి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు అతడి ఆచూకీ కోసం నౌకాపరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఫలితం లేకపోవటంతో ఆదివారం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ సుశీల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ ఎన్ఎన్ఎస్ సింధూకేసరి నౌక వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇన్, అవుట్ గేట్ల వద్ద గల సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి చీరల వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ నాన్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల భార్యలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ నాన్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల భార్యలు ఓ అసోసియేషన్‌గా ఏర్పడి స్థానిక వృద్ధాశ్రమంలోని మహిళలకు వస్త్రాలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహిళలు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తాము కొంత నిధి సమకూర్చి దాని ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.